జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

శనివారం | 15 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 5




# మండల ప్రజావాణి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ఆగస్టు 17 నుంచి మండల ప్రజా వాణి.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** మండల స్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 17వ తేదీ (సోమవారం) నుంచి ప్రతి సోమ వారం జిల్లా కేంద్రంలో

మిగతా 2 లో...

# చట్టాలపై అవగాహన సదస్సులో పాల్గొన్న ఖమ్మం జిల్లా సివిల్ జడ్జి దేవి మానస

- అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ లో చట్టాలపై అవగాహన




**కామేపల్లి ప్రజాజ్యోతి ఆగస్టు 14** కామేపల్లి మండలంలోని ముచ్చర్ల రైతు వేదిక నందు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ లో చట్టాలపై అవగాహన గురించి ప్రజలకు ప్రత్యేకంగా తెలియపరుస్తూ చట్టాలపై అవగాహన గురించి వివరించడం జరిగింది. ఈ అవగాహన సదస్సులో ప్రజలు చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు . ఈ చట్టాలపై ప్రత్యేకంగా తెలుసుకోవాలంటే ముచ్చర్ల రైతు వేదిక నందు ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రైతు వేదిక నందు సదస్సు నిర్వహించబడునని తెలియజేశారు ఈ సదస్సులో ఎటువంటి ఆటంకం లేకుండా కామేపల్లి ఎస్సై శ్రీకాంత్ గారి ఆధ్వర్యంలో సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఏఈఓ దీపక్ రెడ్డి పి ఎల్ వి ఆదూరి సత్యవతి బానోతు సుశీల కల్లేపల్లి జ్యోతి ఏవో తారా దేవి ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ లూసి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- నీటి వనరులను పరిరక్షిస్తూ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి
- జిల్లాలోని అత్యుత్తమ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు
- ప్రతిపాదనలను త్వరిత గతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలి
- కలకోట పెద్ద చెరువు పర్యాటక అభివృద్ధి పురోగతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

**బోనకల్, ఆగస్టు14 (ప్రజాజ్యోతి):** ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులు, సరస్సులను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోనకల్, మధిర మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించి వివిధ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోనకల్ మండలంలోని కలకోట పెద్దచెరువు వద్ద పర్యాటక అభివృద్ధికి మంజూరైన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి

మిగతా 2 లో...

# నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, ఆధునిక సాంకేతికతతో వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలి...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- వ్యవసాయ విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై ప్రాక్టికల్ అవగాహన కల్పించాలి
- పరిశోధన ఫలితాలను రైతులకు చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలి
- మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్



**మధిర ప్రజా జ్యోతి** మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం సేవలు రైతులకు మరింత చేరువ చేసి నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి పంటల్లో అధిక దిగుబడులే లక్ష్యంగా పరిశోధనలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మధిర పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ పరిశోధన కేంద్రం వ్యవసాయ పాలిటెక్నిక్ ను జిల్లా కలెక్టర్ శుక్రవారం

మిగతా 2 లో...

# మంత్రి పొంగులేటి పై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు శోచనీయం

- పొంగులేటి శ్రీనన్నను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు
- ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు



**నేలకొండపల్లి, ఆగస్టు 14 ప్రజా జ్యోతి :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి రాజకీయ విమర్శల పేరుతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై దురుసుగా మాట్లాడటం సరికాదని బచ్చలకూరి నాగరాజు అన్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి వలస వెళ్లిన కౌశిక్‌రెడ్డికి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించే నైతిక స్థాయి లేదని వ్యాఖ్యానించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్వతహాగా కాంట్రాక్టు పనులు చేసుకుంటూ ప్రజలతో మమేకమై ఎదిగిన నాయకుడని, ప్రజల నుంచి వచ్చిన నాయకుడిగా, ప్రజా ఆదరణతో రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలేరు నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లను మంజూరు చేసిన ఘనత మంత్రి పొంగులేటి

మిగతా 2 లో...

## మండల ప్రజావాణి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించుచున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల కేంద్రాల్లోను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో మండల ప్రజావాణి నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల ప్రజావాణి కార్యక్రమాన్ని సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించాలన్నారు. మండల ప్రజావాణి నిర్వహణకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణను ఆగస్టు 16వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు లాగిన్ ఐడీలు,యూజర్ గైడ్స్ అందజేయాలని సూచించారు.ప్రజావాణి నిర్వహించే ప్రదేశంలో ప్రజలకు,అధికారులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు కంప్యూటర్,ప్రింటర్, స్కానర్ తదితర పరికరాలను సిద్ధంగా ఉంచాలని అన్నారు. మండల ప్రజావాణి ప్రారంభం,నిర్వహణపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా ముందస్తుగా సమాచారం పంపాలని ఆదేశించారు.ఈ సమీక్షలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు,ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, డీసీఓ గంగాధర్, డీఎస్ఓ చందన్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి,ఆర్డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి పై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు శోచనీయం

(మొదటి పేజీ తరువాయి...)

శ్రీనివాస్‌రెడ్డిదేనని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారో కౌశిక్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వం పదవులు ఇస్తామని నమ్మించి పలువురిని మోసం చేసిందని, పదవులన్నీ ఒకే కుటుంబానికి పరిమితం చేసుకోవడం వల్లే ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. మీరు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు వెళ్లి పదవుల కోసం ఆశీస్సులు తీసుకున్న పరిస్థితులు గతంలో ఉన్నాయని నాగరాజు వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎవరి కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలే ఆయనకు అండగా నిలుస్తారని నాగరాజు అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వంటి ప్రజాదరణ కలిగిన నాయకులను బీఆర్ఎస్ దూరం చేసుకోవడం వల్లే ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైందని నాగరాజు తోసిపుచ్చారు. ప్రజల ఆదరణతోనే కాంగ్రెస్ నాయకులు గెలిచి చూపించారని, రాబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహుజనుల హక్కుల కోసం కృషి చేస్తా..

- **బీఎస్పీ ఖమ్మం పార్లమెంట్ ఇన్చార్జిగా నామ విజయ్**



**కల్లూరు, ఆగష్టు 14, ప్రజాజ్యోతి** బహుజన సమాజ్ పార్టీ (బి ఎస్ పి ) రాష్ట్ర కార్యవర్గ స మావేశ ంలో ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జిగా బి ఎస్ పి సెంట్రల్ సెక్టర్ కోఆర్డినేటర్ లు అత్తర్ సింగ్ రావు, సురేష్ ఆర్య లు మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన నామా విజయ్ ని నియమించగా రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ నియమాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఇన్చార్జిగా నియమితులైన నామ విజయ్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బహుజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలన్న బి ఎస్ పి లక్ష్యానికి కట్టుబడి ఉంటానని అన్నారు.మహనీయులు బి ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, కాన్షీరాం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామ స్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. బహుజన సమాజం ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ బి ఎస్ పి బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన చీఫ్ జోన్ ఇన్చార్జి దగ్గిళ్ళ దయాందరావు,జోన్ ఇన్చార్జి కర్రె కృష్ణ లకు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి





(మొదటి పేజీ తరువాయి...)

ప్రతిపాదనలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధిర మండలంలోని మడుపల్లి, మధిర ట్యాంక్ బండ్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించి, అక్కడ జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాక్ తదితర నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తినా సహించేది లేదని స్పష్టం చేశారు. మధిర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అభివృద్ధి పనులను రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ... జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం సహజ వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని అన్నారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నీటి వనరులు, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా కలకోట పెద్దచెరువు బండ్ విస్తరణ, పర్యాటక అభివృద్ధి కోసం జి+1 తరహాలో మూడు కాటేజీలు, రిసెప్షన్, కేఫెటీరియా, పార్కింగ్, విద్యుదీకరణ,టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ,స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందేలా, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, మధిర తహసీల్దారు రాంబాబు, బోనకల్ తహసీల్దారు చల్లూరి సుధాకర్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, ఆధునిక సాంకేతికతతో వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

సందర్శించారు. పరిశోధన కేంద్రంలో కొనసాగుతున్న పరిశోధనలు, ఎల్నినో ప్రభావంకు అనుకూలమైన విత్తనాల సరఫరా, విత్తనోత్పత్తి, పంటల సాగు, మౌళిక వసతులు, సిబ్బంది వివరాలు, వ్యవసాయ పాలిటెక్నిక్‌లో అందిస్తున్నకోర్సులు,విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అధికారులు కలెక్టర్‌కు కేంద్రం ఏర్పాటు, ప్రధాన లక్ష్యాలు, ఇప్పటివరకు చేపట్టిన పరిశోధన కార్యకలాపాలు, వివిధ పంటలలో అభివృద్ధి చేసిన సాంకేతికతలు, విత్తనోత్పత్తి తదితర అంశాలను వివరించారు. మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రారంభం తర్వాత జొన్న, పప్పుధాన్యాలు, ప్రస్తుతం పెసర, మినుము పంటలపై ప్రధానంగా పరిశోధనలు, విత్తనోత్పత్తి కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు శాస్త్రవేత్తలు కలెక్టర్ కు వివరించారు. కేంద్రంలో పెసర, మినుము, కంది, జొన్న, వరి తదితర పంటల్లో పరిశోధనలు,నాణ్యమైన బ్రీడర్, ఫౌండేషన్ విత్తనాల ఉత్పత్తి చేపడుతున్నట్లు తెలిపారు. తర్వాత వ్యవసాయ క్షేత్రంలో 2026–27 సంవత్సరానికి వివిధ పంటలకు సంబంధించి అందుబాటులో ఉన్న విత్తన నిల్వలు, ఉత్పత్తి లక్ష్యాలను పరిశీలించి, కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, పెసర, మినుము పంటల్లో అధిక దిగుబడులు, తెగుళ్లు, పురుగులను తట్టుకునే రకాలను అభివృద్ధి చేయడం, వరి మాగాణి పరిస్థితుల్లో పప్పుధాన్యాల సాగుపై పరిశోధనలు చేయడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం ద్వారా అభివృద్ధి చేసిన MGG-385 (మధిర పెసర–01), MGG-389 (మధిర పెసర–389), MBG-1070 (మధిర మినుము–01), MBG-1080 (మధిర మినుము–1080) వంటి రకాల వివరాలను, పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేస్తున్న కొత్త వంగడాలు,సాగు పద్ధతులు,నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే విధానాలు, పంటల ఉత్పాదకత పెంపునకు చేపడుతున్న ప్రయోగాలను రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిశోధన ఫలితాలు ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. నాణ్యమైన విత్తనోత్పత్తికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు అవసరమైన సమయంలో విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు.పప్పుధాన్యాల సాగు విస్తరణకు అనువైన సాంకేతికతలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, పంటల మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మధిర వ్యవసాయ పాలిటెక్నిక్‌ను కలెక్టర్ సందర్శించారు. కళాశాలలో అందిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమా కోర్సు, విద్యార్థుల ప్రవేశాలు, బోధనా సిబ్బంది, ప్రాక్టికల్ శిక్షణ, విద్యార్థులకు అందుతున్న ఇతర సౌకర్యాలను పరిశీలించారు. వ్యవసాయ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు పంటల సాగు, వ్యవసాయ సాంకేతికత, యాంత్రీకరణ, ఉద్యానవనం తదితర అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. వ్యవసాయ విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు క్షేత్రస్థాయి అనుభవం కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సూక్ష్మ సేద్యం, విత్తనోత్పత్తి, పంటల సంరక్షణ, మార్కెటింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె. రుక్మిణి దేవి, మధిర తహసీల్దారు రాంబాబు, వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలి

- చట్టాల పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలి
- పారా లీగల్ వాలంటరీ కొలిపాక నాగమణి



**నేలకొండపల్లి, ఆగస్టు 14 ప్రజా జ్యోతి** :విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల ను అలవర్చుకోవాలని పారా లీగల్ వాలంటీర్ కొలిపాక నాగమణి సూచించారు. మండలం లోని బైరవునిపల్లి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడా రు... బాల్య వివాహాల ను అరికట్టేందు కు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు. బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో చట్టం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. విద్యార్థులు చెడు మార్గం వదిలేసి... సమాజం కు ఉపయోగపడే కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. డ్రగ్స్ కు దూరంగా ఉండాలని... అదే విధంగా ఎక్కడైనా "విక్రయాలు చేపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వద్దన్నారు. చట్టాల పై అవగాహన కల్పించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాలంటీర్స్ కిషన్రావు, జీ. సరిత, కె.నాగేంద్ర, జీ.నాగలక్ష్మి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# మంగాపురంలో ఉచిత వైద్య శిబిరం

- సర్పంచ్ ధీరావత్ అశోకారాణి



**నేలకొండపల్లి, ఆగస్టు 14 ప్రజా జ్యోతి :** వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ప్రత్యేక ఆదేశాల మేరకు మండల పరిధిలోని మంగాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక రాణి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అందులో భాగంగానే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలంగా దగ్గు జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతున్నప్పుడు వారు వెంటనే వైద్యులను సంప్రదించి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని, అలాగే ప్రభుత్వం అందించే ఉచిత మందులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి, ఏఎన్ఎం ఉమా, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, గ్రామ కార్యదర్శి రాధాకృష్ణ, మత్స్యశాఖ పారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, మల్లికార్జున రావు,నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధి కి సేవ చెయ్యడం అభినందనీయం

- తహసీల్దార్ లూథర్ విల్సన్





**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి ఆగస్టు 15** మండలంలోని వెదుళ్ల చెరువు పాఠశాల అభివృద్ధి తో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి సేవలు చెయ్యడం అభినందనీయమని మండల తహసీల్దార్ లూథర్ విల్సన్ అన్నారు. శుక్రవారం మండలం లోని వెదుళ్ల చెరువు పాఠశాలలో కమతం రాము స్నేహితుడు, లండన్‌కు చెందిన జాన్ కోప్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుస్తువులు,నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేయడంతో పాటు వృద్ధులు, అనాథలకు చీరలు, దుస్తులు అందించే కార్యక్రమం లో పాల్గొని మాట్లాడారు. లండన్ కి చెందిన జాన్ కోప్ తన మిత్రుడు రాము ద్వారా గత అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. అనారోగ్యంతో కంటి చూపుని కోల్పోయినప్పటికీ గ్రామంలో విద్యాభివృద్ధి కి కృషి చెస్తున్న కమతం రాముని శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరేంపుల వినోద ఉపసర్పంచ్ పులకాని రమేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, గ్రామ పెద్దలు కమతం బాబు, వల్లభనేని వినయ్ కుమార్, శ్రీకాంత్, డాక్టర్ సుధీర్ సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కియా మోటార్స్ మరియు యన్.వి.హెచ్ ఇండియాకు 73 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరంతర శిక్షణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాల ఫలితంగా తమ విద్యార్థులు ప్రముఖ వాహనరంగ పరిశ్రమలైన కియా మోటార్స్ మరియు యన్.వి.హెచ్ ఇండియా సంస్థలలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ గా ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో ఈ.సి.ఈ.,ఈ.ఈ.ఈ.విభాగాలకు చెందిన 73 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం,కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నిర్వహించిన శిక్షణ ఈ విజయానికి ప్రధాన కారణమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు.కళాశాల వైస్–ఛైర్మన్ కె. శ్రీచైతన్య మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే తమ లక్ష్యమని, ప్రముఖ సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో విద్యార్థులకు అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డా జి.రాజ్‌కుమర్ తెలిపారు.కియా మోటార్స్ మరియు యన్.వి.హెచ్ ఇండియా సంస్థలలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీలుగా ఎంపికైన విద్యార్థులకు వార్షిక ఆధాయంగా 2.50 లక్షలు అందుకుంటారని తెలిపారు.ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం,ప్రిన్సిపాల్, అధ్యాపకులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్వెస్‌కార్ప్ సీనియర్ హెచ్.ఆర్. యన్. రాజు, హెచ్.ఆర్. యస్.కె. నుస్రత్ జహా తో పాటు కళాశాలఅకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డా యన్. సవిత, డా జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సిఐటియు రైతు సంఘం ,వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 14** కామేపల్లి మండలంలోని జాతి పల్లి హైస్కూల్ నందు సర్వే చేయరా స్కూల్లో ఉన్న సమస్యలు జిల్లా నాయకత్వం దృష్టికి రావడం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్ రైతు సంఘం జిల్లా వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గీ కృష్ణ సిఐటియు మండల కార్యదర్శి బాదావత్ శ్రీను మాట్లాడుతూ స్కూల్లో వాటర్ ట్యాంక్ లేక సౌకర్యాలు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందుపడుతున్నారు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అలాగే బాత్రూం లెట్రిన్లు విద్యార్థులకు సక్రమంగా లేవని టీచర్లకు బాత్రూములు లేక బహిర్గతంగా బయటికి పోతున్నారని వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది అదేవిధంగా హైస్కూల్లో టీచర్ లేక తరగతులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు . పై సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు లేనిపక్షంలో రాబోవు రోజులలో పోరాటాలు నిర్వహిస్తామని వారు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంబటి శ్రీనివాస్ రెడ్డి రాయల సత్యనారాయణ అడపా ఉపేందర్ హీరో స్వామి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పొలంలో వ్యవసాయ కుంట పనులకు శ్రీకారం

**చింతకాని ఆగస్టు14 ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో జల నిధి రైతు ఫార్మర్ ఫండ్ పథకం కింద తిరుమలాపురం గ్రామంలో వ్యవసాయ కుంట నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన రైతు చింతల రామారావు పొలంలో 12 ×12 కొలతలతో వ్యవసాయ కుంట నిర్మించేందుకు భూమిపూజ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, ఉప సర్పంచ్ గోగుల నాగమణి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతులకు నీటి భద్రత కల్పించడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు వ్యవసాయ కుంటలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని తమ పొలాల్లో నీటి వనరులను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ కుంటల నిర్మాణంతో వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసుకోవచ్చని,పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రైతు చింతల రామారావు మాట్లాడుతూ తన పొలంలో వ్యవసాయ కుంట నిర్మాణానికి సహకరించిన అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోగుల నరసింహారావు, మడిపల్లి రామకృష్ణ, ఉపాధి కూలీలు,గ్రామ ప్రజలు, రైతులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పల్లె దవాఖానాను సందర్శించిన ముచ్చర్ల సర్పంచ్ జైయె లూసి



**కామేపల్లి ప్రజా జ్యోతి ఆగస్టు 14** కామేపల్లి మండలంలోని ముచ్చర్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సందర్శించి ప్రజలకు అందుబాటులో ఉంది ప్రజల ఆరోగ్యానికి కాపాడాలని డాక్టర్లకు ప్రత్యేకంగా కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ లూసి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా సకాలంలో వైద్యం చేయాలని వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సరైన చికిత్స చేయాలని వారు డాక్టర్ను కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్లు మరియు ఆరోగ్య సిబ్బంది మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## హల్ద్వానీ ఘటన ప్రజాస్వామ్య విరుద్ధం

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి
- ఈ ఘటనను ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, సత్యాగ్రహం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఏఐసీసీ ఆదేశాల మేరకు టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు హల్ద్వానీలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పై జరిగిన అవమానకర చర్యను ఖండిస్తూ, ఆయనకు సంఘీభావంగా శుక్రవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ,అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ మరియు సత్యాగ్రహం నిర్వహించనైనది.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా మహిళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా యస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, మాజీ డిప్యూటీ మేయర్ ముక్తార్ జోహారా, మాజీ కార్పొరేటర్లు కమర్తపు మురళి ,కన్నం వైష్ణవి ప్రసన్న, పి ఏ సి ఎస్ చైర్మన్ రావూరి సాయిబాబు,శ్రేణులతో కలిసి యాత్ర జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి ప్రారంభమై జెడ్పీ సెంటర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నిరసనగా నిరసన ర్యాలీ నిర్వహించనైనది.ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ ,నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వర రావు లు మాట్లాడుతూ,హల్ద్వానీలో కాంగ్రెస్ ర్యాలీ జరిగిన ప్రదేశంలో హిందూ మితవాద సంస్థలు గంగాజలంతో 'శుద్ధీకరణ'పేరుతో చేసిన చర్య అత్యంత హేయమైనది అని ఇది ప్రజాస్వామ్య విరుద్ధం అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షులు దళిత సామాజిక వర్గానికి చెందినవారు కావడం వల్లే ఈ వివక్ష చూపారని ఇది స్పష్టంగా తెలుస్తోంది అని అన్నారు.ఇది బీజేపీ యొక్క విభజన, వివక్షాపూరిత రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు.భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వం,సౌభ్రాతృత్వం,మానవ గౌరవం వంటి విలువలకు ఇది పూర్తిగా వ్యతిరేకం అని లక్షలాది మంది భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్,జిల్లా కాంగ్రెస్ సీనియర్ రంగా జనార్ధన్,జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కిలారు అనిల్ కుమార్,ముక్తార్, కొట్టే రాజశేఖర్,పల్లపాటి కృష్ణ,అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కోసూరి ప్రసాద్, ఏలూరి శ్రీనివాస్, జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ,నగర కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు షేక్ అబ్బాస్ బేగ్,బాణాల లక్ష్మణ్,నాయకులు గడ్డం వెంకటయ్య,కిలారు వెంకటరమణ, నాళం సతీష్,ఫరీద్ ఖాద్రి,దామా స్వరూప,లక్ష్మి, సుగుణ,ప్రతిభారెడ్డి,నీలవేణి పీసీసీ, డిసిసి నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఐ ఎన్ టి యు సి, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, సేవాదళ్ ,ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ, కిసాన్ సెల్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యులపై దాడులు, ఆసుపత్రి ఆస్తుల ధ్వంసాన్ని ఖండించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఖమ్మం

- క్వాకరీపై కఠిన చర్యలకు డిమాండ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఆసుపత్రి సిబ్బందిపై దాడి చేసి,ఆసుపత్రి ఆస్తులను ధ్వంసం చేసిన ఘటనను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖమ్మం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు పాల్పడిన సంఘవిద్రోహ శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రులు, వైద్యులు, వైద్య సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని కోరుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్ కి ఐఎంఏ ఖమ్మం తరఫున వినతిపత్రం సమర్పించింది.ఆసుపత్రి సిబ్బందిపై దాడి చేసి, ఆసుపత్రి ఆస్తులను ధ్వంసం చేసిన వ్యక్తులే తిరిగి అధికారులకు ఫిర్యాదు చేయడం పట్ల ఐఎంఏ ఖమ్మం తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తమ చర్యలకు బాధ్యత వహించాల్సిన వ్యక్తులు, జరిగిన ఘటనపై తిరిగి ఫిర్యాదు చేయడం విచిత్రంగా ఉందని పేర్కొంది. వాస్తవాలను సమగ్రంగా పరిశీలించి, దాడి మరియు ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఐఎంఏ కోరింది. ఈ సందర్భంగా మృతి చెందిన హేమశ్రీ కుటుంబ సభ్యులకు ఐఎంఏ ఖమ్మం తరఫున ప్రగాఢ సానుభూతి,సంతాపాన్ని తెలియజేస్తున్నామని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల బాధను గౌరవిస్తూ, ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే వాటిని చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని,హింసకు పాల్పడడం లేదా ఆసుపత్రుల ఆస్తులను ధ్వంసం చేయడం పరిష్కారం కాదని తెలిపారు.అలాగే క్వాకరీ అర్హత లేని వ్యక్తులు వైద్య సేవలు అందించడం ను ఐఎంఏ ఖమ్మం తీవ్రంగా ఖండించింది.ప్రజల ఆరోగ్యం, ప్రా ణాలకు ప్రమాదం కలిగించే అనధికార వైద్య పద్ధతులపై సంబంధిత అధికారు లు కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది.ప్రజలకు నాణ్యమైన,నైతిక,శాస్త్రీయ ఆధారిత వైద్య సేవలు అందించేందుకు వైద్యుల సంఘం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, క్వాకరీకి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు,చట్టబద్ధమైన పోరాటాన్ని కొనసాగిస్తామని ఐఎంఏ ఖమ్మం స్పష్టం చేసింది.వైద్యులు–ప్రజల మధ్య పరస్పర విశ్వాసం, శాంతియుత వాతావరణం, భద్రతతో కూడిన వైద్య సేవలే తమ లక్ష్యమని ఐఎంఏ ఖమ్మం పేర్కొంది.

## చైనా కమ్యూనిస్టు కు వణికి పోతున్న అమెరికా అధ్యక్షుడు

- బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్న ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు
- డిప్యూటీ సీఎం సతీమణి పై ఎందుకు ఆరోపణలు వస్తున్నాయి
- భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు



**బోనకల్, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి):** ప్రపంచ దేశాలపై యుద్ధాలు చేస్తూ అనేక దేశాలను భయపెడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చివరకు చైనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి భయపడి ట్రంపు పెట్టెలో పారిపోయే దుస్థితికి దిగజారిపోయాడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ఎద్దేవా చేశారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మధిర డివిజన్ కమిటీ సమావేశం శీలం నరసింహారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇరాన్ పై ఏకపక్షంగా అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని విమర్శించారు. తుర్కియే రాజధాని అంకారాలో జరిగిన నాటో సదస్సు నుంచి డోనాల్డ్ ట్రంప్ తిరిగి అమెరికా వెళ్లే సమయంలో ఇరాన్ దాడి చేస్తుందనే భయంతో తాను ప్రయాణం చేయవలసిన ఎయిర్ ఫోర్స్ వన్ లో కాకుండా మరో విమానంలో వెళ్లిపోయాడని ఎద్దేవా చేశారు. ఈ విషయంపై అమెరికాలో జర్నలిస్టుల ప్రశ్నించగా డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఇరాన్ వెనుక చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ఉందని చెప్పటం విశేషం అన్నారు. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని చూస్తే డోనాల్డ్ ట్రంప్ భయపడిపోతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటు చట్టాలను సైతం గౌరవించకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 10న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు జైల్ భరో కార్యక్రమం నిర్వహించి జయప్రదం అయ్యాయన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన నిర్వహించి విజయం సాధించారన్నారు. చివరకు విద్యార్థుల ఉద్యమానికి బిజెపి కేంద్ర ప్రభుత్వ విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయవలసి వచ్చింది అన్నారు. పార్లమెంటులో విద్యార్థులపై లాఠీచార్జికి ఆదేశాలు ఇచ్చింది ఎవరో స్పష్టం చేయాలని కాంగ్రెస్ పట్టుపడుతుంటే హోం శాఖామంత్రి సమాధానం చెప్పకుండా పార్లమెంట్ కు రాకుండా పారిపోతున్నాడని విమర్శించారు. ప్రధానమైన సమస్యలు పార్లమెంట్ లో చర్చకు వచ్చే సందర్భంలో ప్రధానమంత్రి హోం శాఖ మంత్రులు పార్లమెంటుకు రాకుండా పారిపోతారన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన ప్రతిపక్షాలు ప్రజల పక్షాన నిలబడి సముచితమైన పోరాటాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ విచ్ఛిన్నకర విధానాలను అమలు చేస్తున్నాడని ఆ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిపిఎం నికరంగా నిలబడి పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ప్రచారం కోసం పాకులాడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై అనేక అవినీతి ఆరోపణలు కుంభకోణాలు వస్తున్నాయన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన సతీమణిని కాంట్రాక్టర్ల ఉద్యోగుల నుంచి కమిషన్ల వసూళ్లు కోసం నియమించుకున్నాడని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో భట్టి విక్రమార్క తో పాటు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంత్రులుగా ఉన్నారని వారి సతీమణిలపై రాని ఆరోపణలో డిప్యూటీ సీఎం సతీమణి పై ఎందుకు ఆరోపణలు వస్తున్నాయో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి పద్మ, బండి రమేష్, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, వాసిరెడ్డి వరప్రసాదరావు, కిలారు సురేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, మద్దాల ప్రభాకర్, పడకంటి మురళి, బంటు పురుషోత్తం, వేలుపుల భద్రయ్య, రాయబారపు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి వీవో కార్యాలయం

**చింతకాని ఆగస్టు 14ప్రజాజ్యోతి :**మండల పరిధిలో బొప్పారం గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నిర్మిస్తున్న వీవో కార్యాలయ భవన స్లాబ్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ షేక్ రహమతుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ షేక్ రహమతుల్లా మాట్లాడుతూ.. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాలు,శిక్షణా తరగతులు నిర్వహించేందుకు వీవో కార్యాలయ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు, మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని పేర్కొన్నారు.మహిళా సంఘాలకు అవసరమైన సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు ఒకే వేదికపై నిర్వహించుకునే అవకాశం కలగడంతో సంఘాల పనితీరు మరింత మెరుగుపడుతుందని సర్పంచ్ తెలిపారు.గ్రామ అభివృద్ధితో పాటు మహిళల ఆర్థిక సాధికారతకు పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రఘు, షేక్ సిలార్ సాహెబ్,బోయ శీను,రేఖం వెంకటేశ్వర్లు, ఉపేందర్, షేక్ సొందు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# అధికార అహంకారంతో రైతులతో భట్టి చెలగాటం

- పనికిరాని పనులకు స్వాహా కోసమే రూ. 5 కోట్లు మంజూరు
- కోర్టు తీర్పు ప్రకారం రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలి
- ఆళ్లపాడులో జాలిముడి కాలువను రైతులతో కలిసి పరిశీలించిన మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు



**బోనకల్, ఆగస్టు 14 (ప్రజా జ్యోతి):** అధికార అహంకారంతో రైతుల జీవితాలతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెలగాటమాడుతున్నాడని, పనికిరాని జాలిముడి కాలువకు స్వాహా కోసమే రూ. 5 కోట్లు మంజూరు చేశారని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు మండిపడ్డారు. మండల పరిధిలోని ఆళ్లపాడులో జాలిముడి కాలువను బాధిత రైతులతో కలిసి లింగాల కమల్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి జాలిముడి కాలువ వద్దనే విలేకరులతో ఆయన మాట్లాడారు. 2013 లో జాలిముడి కాలువ పనుల ప్రారంభించారని తెలిపారు. ఆ సమయంలో రైతుల తమకు న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తేనే తమ భూముల ఇస్తామని పట్టుబట్టారన్నారు. కానీ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికార ధర్పంతో పోలీసులచే రైతులను అడ్డుకొని జాలిమూడి కాలువ పనులు చేశారన్నారు. భూములను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండానే బలవంతంగా పనులు చేయించారన్నారు. ఆనాడు ఎకరానికి కేవలం రూ. 3 లక్షల మాత్రమే ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తే అందుకు రైతులు అంగీకరించలేదన్నారు. రైతులు కూడా ఆ నష్టపరిహారం నేటికీ తీసుకోలేదన్నారు. దీంతో ఆ తర్వాత రైతులు హైకోర్టుకి వెళ్లారన్నారు. ఆ తర్వాత రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హాయంలో తాను రైతులను తీసుకొని రెండు మూడుసార్లు జిల్లా కలెక్టర్ ను కూడా కలిశానని తెలిపారు. అయితే ఆనాడు జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారం హైకోర్టులో ఉన్నందువలన ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేమని స్పష్టం చేశారన్నారు. అయితే 6 అక్టోబర్ 2023న హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఆ తీర్పు ప్రకారం రైతులతో స్వయంగా మాట్లాడి రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు. కోర్టు తీర్పు అనంతరం బాధిత రైతులందరూ అనేకసార్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కని కలిసి కోర్టు తీర్పు ప్రతిని కూడా అందజేసినట్లు తెలిపారు. అయినా డిప్యూటీ సీఎం ఆనాడు రైతులు జాలిమూడి కాలువ పనులు అడ్డుకున్నారనే అక్కసుతో రైతులపై కక్షగట్టారన్నారు. జాలిమూడి కాలువ వలన 4700 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆనాడు ప్రకటించారని, కానీ నేటికీ ఒక్క ఎకరానికి కూడా ఆ కాలువ ద్వారా సాగునీరు అందలేదన్నారు. ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించని కాలువకు మరమ్మత్తుల పేరుతో రూ.5 కోట్లు కమిషన్ల కోసమే మంజూరు చేశారని, రైతుల కోసం కాదన్నారు. తమకు నష్టపరిహారం చెల్లించకుండా మరమ్మత్తు పనులు చేస్తే సహించేది లేదని రైతుల పనులను అడ్డుకున్నారని తెలిపారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని లేనియెడల తాము రైతుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జాలిముడి కాలువ చూస్తే మేడిపండు గుర్తుకు వస్తుందని, ఆ వెంటనే భట్టి విక్రమార్క నిర్వాహకం అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 31 నెలలు అవుతున్న రైతులకు నష్టపరిహారం ఎందుకు చెల్లించలేదో భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పనులు అడ్డుకున్నారనే నెపంతో అధికారులతో రైతులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. పంచ కట్టు కట్టినంత మాత్రాన రైతు బాంధవుడు కాలేవని డిప్యూటీ సీఎంపై వ్యంగాస్త్రాలు సంధించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు జంగా రవికుమార్, గద్దల వెంకటేశ్వర్లు, వేమూరి ప్రసాదరావు, ఎంగల కనకయ్య, మోదుగుల నాగేశ్వరరావు, ఆళ్లపాడు సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరరావు, జెర్రిపోతుల రవీంద్ర, పారా ప్రసాద్, బాధిత రైతులు పిట్టల కృష్ణ, పరుచూరి కృష్ణమూర్తి, వల్లేబోయిన కొండలరావు, పరుచూరి అప్పారావు, కొమ్మినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించబడ్డప్పుడే నిజమైన స్వాతంత్రం

- కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం
- విద్యార్థులపై కేసు లేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బంక వీరభద్ర మహారాజ్



**ముదిగొండ ఆగస్టు 14 (ప్రజా జ్యోతి)** భారతదేశమంతా ఆగస్టు 15వ రోజున స్వాతంత్ర దినోత్సవ జరుపుకుంటున్న నేపథ్యంలో ముదిగొండ మండల బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బంక వీరభద్ర మహారాజ్ ఒక కీలక ప్రకటన చేశారు. భారతదేశంలో అగ్రవర్ణాలకు తప్ప ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు ఇంకా స్వతంత్రం రాలేదని అన్నారు. ఈ స్వతంత్ర భారతదేశంలో ఉద్యోగాలు అడుక్కునే పరిస్థితి దాపరించింది. కష్టపడి చదివిఎగ్జామ్స్ రాసిన పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలు ఆగమైపోతున్నాయి. ఇదేంటనని ప్రశ్నించిన విద్యార్థులను విచక్షణారహితంగా కొడుతూ వారిపై కేసులు పెడుతూ విద్యార్థులను ఉగ్రవాదులతో పోలుస్తున్నారు. ఇది మారాలంటే భారతదేశానికి అసలు సిసలైన స్వతంత్రం రావాలని అన్నారు. రైతులు యూరియా కోసం యాప్ ఇన్స్టాల్ చేసుకుని బుకింగ్ చేస్తున్న రైతుకు నిరాశ ఎదురవుతుంది. రైతే రాజు అన్నారు. కానీ ఆ రాజే ఈరోజు బిల్డింగ్ దగ్గర వాచ్మెన్ గా పనికొస్తున్నాడు. ఈ పరిస్థితి మారాలి అని అన్నారు. తక్కువ శాతం ఉన్న అగ్రవర్ణాలు ముఖ్యమంత్రులుగా ఎమ్మెల్యేలుగా కొనసాగుతుంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ నాయకులు కార్యకర్తలుగా మిగిలిపోతున్నారు. ఇది మారాలి. నిధులు నియామకాలు అన్ని వర్గాలకు సమానంగా అందినప్పుడే నిజమైన స్వాతంత్రం అని అన్నారు.

# సొంతింటి నిర్మాణం పేదవానికి ఒక కల

- మాజీ సర్పంచ్ గంటా శ్రీనివాసరావు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకం రాష్ట్రంలో దాదాపు అన్ని గ్రామాల్లో పేదవాళ్ళకి సొంతింటి కలను నెరవేర్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల పక్షపాతనీ ఇది పేదల అవసరాలు కోసం వారి అవసరతలు తీర్చడం కోసం ఏర్పడిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మాజీ సర్పంచ్ గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు మండల పరిధిలోని మోలుగుమాడు గ్రామంలో జిల్లేపల్లి పుల్లారావు వెంకటేశ్వరమ్మ దంపతులు ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణం కింద మంజూరైన ఇంటిని మాజీ సర్పంచ్ గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతింటి కల పేదవానికి కలల మిగలకూడదని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టి పేదవాడి కలను నిజం చేసిందని గ్రామాభివృద్ధిలో తను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గ్రామానికి కావలసిన మౌలిక సదుపాయాలన్నిటిని పూర్తి స్థాయిలో కల్పిస్తానని జిల్లాలోనే మోలుగుమాడు గ్రామాన్ని ఒక ఆదర్శవంతమైన గ్రామంగా అత్యంత అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు ఇదే సందర్భంలో పుల్లారావు వెంకటేశ్వరమ్మ దంపతులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి గ్రామ సర్పంచ్ గంటా తిరుపతమ్మకు ఇంటి నిర్మాణంలో సహాయ సహకారాంధించిన గంటా శ్రీనివాసరావు చిరు సన్మానం చేసి కుటుంబ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మైలవరపు సత్యనారాయణ మాజీ సర్పంచ్ కటారపు బ్రహ్మయ్య రెళ్ళచర్ల వీరభద్రరావు నరసింహారావు ఆర్డబ్ల్యూఎస్ రాష్ట్ర నాయకులు జిల్లేపల్లి బాబురావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# క్రైట్స్ అకాడమీ డైరెక్టర్ కు విద్యారత్న అవార్డు

- 12 ఏళ్లలో 6 వేల ఉద్యోగాలు సాధించిన ఘనత క్రైట్స్ అకాడమీదే..





**తిరుమలాయపాలెం ప్రజా జ్యోతి ఆగస్టు 15** విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న క్రైట్స్ అకాడమీ డైరెక్టర్ వి.తిరుపతి కి ప్రతిష్ఠాత్మక విద్యారత్న అవార్డు లభించింది. క్రైట్స్ అకాడమీని స్థాపించిన 12 సంవత్సరాల కాలంలోనే సుమారు 6 వేల మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా శిక్షణ అందించడం అకాడమీకి దక్కిన ఘనతగా నిలిచింది. క్రైట్స్ అకాడమీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ, ఉద్యోగ సాధనకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పిస్తున్న వి.తిరుపతి సేవలను గుర్తించిన నిర్వాహకులు ఆయనకు విద్యారత్న అవార్డును అందజేశారు. అతి చిన్న వయసులోనే ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోవడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని తిరుపతి తెలిపారు. గురువారం హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వేదికగా జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా తిరుపతి విద్యారత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు. అనంతరం మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి మాట్లాడుతూ.. క్రైట్స్ అకాడమీ గత 12 సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ, వారిని ఉద్యోగ సాధన దిశగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఇప్పటికే సుమారు 6 వేల మంది ఉద్యోగాలు సాధించడం క్రైట్స్ అకాడమీ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా క్రైట్స్ అకాడమీ నుంచి మరింత మంది విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో క్రైట్స్ అకాడమీ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.